# యేసు సిలువపై ఎందుకు మరణించవలసి వచ్చింది?

క్రీస్తు మరణోద్దేశం మన పతనంలో క్లుప్తంగా చర్చించబడింది,[1] వంద పుస్తకాలైనా ఈ అంశాన్ని చాలినంతగా వివరించలేవు; వేయి ప్రశ్నలడిగినా తగిన జవాబు చెప్పలేం. అయినా, ప్రస్తుతానికి కొన్ని సంగతులు సరిపోతాయి.[2]

"అందరు పాపము" చేశారు (రోమా. 3:23ఎ) మరియు "పాపమునకు వచ్చు జీతము మరణము" (రోమా. 6:23). పాపులు ఆత్మసంబంధమైన మరణాన్ని పొందుతారు – అంటే, ఈ జీవితకాలంలో – దేవునినుండి వేరు చేయబడతారు (ఎఫెసీ. 2:1, 12). పైగా, వారు "రెండవ మరణాన్ని" ఎదుర్కొంటారు, అంటే, రాబోవు జీవితంలో వారు దేవునినుండి శాశ్వతంగా దూరమౌతారు (ప్రకటన 20:14; 21:8).

పాపము పరిశుద్ధ దేవుని అవమానపరుస్తుంది (రోమా. 3:23బి; యెషయా 5:16; హెబ్రీ. 10:29లను చూడు). మంచి పనులు చేసినా పాపాల్లో ఒక్కదానినైనా అవి తుడిచివేయనేరవు; మనము మన క్రియలవలన రక్షింపబడలేం (ఎఫెసీ. 2:8, 9). మనం ఎంత మంచి చేసినా, అది చాలినంత మంచి కానేరదు (యెషయా 64:6; రోమా 3:12). న్యాయవంతుడైన దేవుడు (యెషయా 30:18) శిక్షను విధించకుండ పాపాన్ని తొలగిపోనియ్యడు (రోమా 1:18). పాప దోషాన్ని తొలిగించుకోలేని స్థితిలో అందరు పాపము చేసియుండగా, మానవాళి గతి బహు దారుణమై మిగిలింది.

దేవునికి స్తోత్రం. ఆయన న్యాయవంతుడైన దేవుడు మాత్రమే అయ్యుండక, ప్రేమ మయుడైన దేవుడుగా కూడా ఉన్నాడు (1 యోహాను 4:8)! ప్రేమమయుడైన దేవుడుగా ఎవడు నశింపవలెనని ఆయన యిచ్ఛయించలేదు (2 పేతురు 3:9). దేవునిలో ఉన్న ఈ రెండు లక్షణాలు సందిగ్ధాన్ని కల్పించాయి. నీతిమంతుడైయుండి ఒకేసారి అటు పాపమును శిక్షించి, ఇటు పాపులను సమర్థించువాడుగా ఎట్లు ఉండును (రోమా 3:26 చూడు)? "ఆ వెల నేనే చెల్లించే ఏర్పాటు చేస్తాను; మానవాళి పాపశిక్షను అనుభవించడానికి నా కుమారుని పంపుతాను అని దేవుడే ఆ సందిగ్ధానికి జవాబిచ్చాడు" (యోహాను 3:16). 1 యోహాను 4:10లో మనం యిలా చదువుతాం, "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను ..." "ప్రాయశ్చిత్త"మంటే "సంతుష్టిపరచునది, లేక దేవుని న్యాయాన్ని సమ్మతిపరచేది" అని అర్థం.

న్యాయాన్ని సమ్మతిపరచే బాధ ఎట్టిదైయుండాలి? దేవుడు మానవాళితో పెట్టుకున్న తొలి లావాదేవీలలో, బలియర్పణ అనే సూత్రం – ఒక జీవి పక్షంగా మరొక జీవి

అర్పింపబడడం – ఏర్పాటు చేయబడింది (ఆది. 4:4; 8:20: 31:54; 12:7ను చూడు). “రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు” అనే సూత్రం స్థిరం చేయబడింది (హెబ్రీ. 9:22). దేవుని ఆదేశము మేరకు అప్పటికాలమంతటిలో లక్షలకొలది జంతువులు బలిగా అర్పింపబడ్డాయి. అయితే సమస్య ఏమంటే, “ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము” (హెబ్రీ. 10:4). ఒకే బలి పాపమును తీసివేయజాలును; అది పరిపూర్ణుడైన దేవుని కుమారుని బలి (1 పేతురు 1:18, 19). ఆయన రక్తము మనలను “దేవుని ఉగ్రతనుండి రక్షింపగలదు” (రోమా 5:9). “పాపక్షమాపణ నిమిత్తము” (మత్తయి 26:28) క్రీస్తుయొక్క అమూల్యమైన రక్తమే చిందింపబడవలసియుంది.

ఏ రూపంలో క్రీస్తు తన రక్తాన్ని చిందింపవలసియుంది? దేవుని నిత్య సంకల్పము చొప్పున (ఎఫెసీ. 3:11) సిలువ వేయబడడంవలన మరణించాలని ముందుగానే తీర్మానించబడింది. వేదన అనుభవించే సేవకుని కాళ్లు చేతులు “పొడవబడాలని” కీర్తన రచయిత అన్నాడు (కీర్తన. 22:16). ఆయన సిలువ వేయబడతాడనే విషయాన్ని క్రీస్తు ప్రభువు తానే స్వయంగా సూచించారు (మత్తయి 20:17–19; లూకా 24:6, 8లను చూడు) – అందులో ఆయన కాళ్లు చేతులు గ్రుచ్చబడడం ఉంది.[3] యేసు రోమా సిలువపై మృతినొందినప్పుడు, ఆయన చేతులలోనుండి కాళ్లలోనుండి. ముండ్ల మకుటముచే కొట్టబడిన నుదుటినుండి, చీల్చబడిన వీపునుండి రక్తము ధారలై ప్రవహించింది. ఆయన మరణించిన తరువాత పొడువబడిన ఆయన ప్రక్కలోనుండి రక్తము కారిపోయింది (యోహాను 19:34). బైబిలు ప్రకారం, ఆయన రక్తమువలన మనము నీతిమంతులముగా తీర్చబడ్డాం, దేవునితో సమాధానపరచబడ్డాం, దేవుని ఉగ్రతనుండి రక్షించబడ్డాం (రోమా 5:9, 10).

క్రీస్తు మరణము మన రక్షణను ఎలా సాధ్యం చేసిందో ఖచ్చితంగా మనం గ్రహించగలమా? లేదు – అయితే మనం దీనిని గ్రహించగలం: ఆయన మరణము దేవుని న్యాయాన్ని సంతృప్తిపరచింది (రోమా 3:25; హెబ్రీ. 2:17; 1 యోహాను 2:2). గనుక, తన ప్రేమకు ఎవరు సుముఖంగా బదులివ్వగలరో (యోహాను 14:15; 1 యోహాను 4:19) మరియు ఆయన రక్షణ షరత్తులను అంగీకరించుతారో (మార్కు 16:15, 16; అపొ. 2:37, 38), వారు రక్షింపబడతారు! మనకొరకు దేవుడు ఏమి జరిగించాడో దానిని మనం సంపూర్ణంగా గ్రహించలేము, కాని దానికొరకు మనమాయనను స్తుతించుదాం. “చెప్ప శక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము!” (2 కొరింథీ. 9:15).

---

సూచనలు

[1]ఉదాహరణకు, “క్రీస్తు జీవితం, 6”లో చూడు. [2]“The Center of God's Love” in David Roper, *Jesus Christ and Him Crucified* (Arvada, Colo.: Christian Communications, 1976). [3]జెకర్యా 12:10లో మెస్సీయ వేరువిధంగా “పొడువబడినట్టు” చిత్రింపబడింది (యోహాను 19:34, 37).